

సత్యవాక్కు
The Word of Truth
క్రైస్తవ మాసపత్రిక
JANUARY - 2010
సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2009 డిశంబరు 1 నుండి 4 వరకు కాకినాడ సత్యవాణి – క్రీస్తు సంఘ ఆవరణములో గొప్ప బైబిలు లెక్చరర్‌షిప్ జరిగెను. ఆ కూటములకు ఆంధ్రప్రదేశ్‌ను నుండి పలు ప్రాంతముల ప్రజలు హాజరై గొప్ప బైబిలు పాఠములను నేర్చుకొనిరి. ఆత్మీయముగా బలపడిరి. హాజరైన వారందరికీ ఉచిత భోజన వసతి సౌకర్యములు కల్పించబడెను. అందరి సదుపాయములను స్థానిక క్రీస్తు సంఘస్థులు చక్కగా చూచుకొనిరి.

డిశంబరు మొదటి రోజున బిల్లీ బ్లేండ్, జిమ్ కెల్లీ, డిలాన్ కూపర్, ఏంద్రూ విల్సన్. ఆర్ట్‌క్రో, స్టీఫెన్ సట్టన్, రే మేపిల్స్ గార్లు ఉపదేశించిరి. ఈ సంవత్సరము లెక్చరర్‌షిప్ యొక్క అంశము "కొండ మీద ప్రసంగము". గాన అందరు యేసు చేసిన కొండ మీద ప్రసంగములోని వాక్యభాగములపై ఆధారపడి గొప్ప ఆత్మీయ సత్యములను ఉపదేశించిరి.

డిశంబరు రెండో తేదీనాడు బిల్లీ బ్లేండ్, జిమ్ కెల్లీ, స్టీఫెన్ సట్టన్, జిమ్ కెల్లీ గార్లు ఉపదేశించిరి. బిల్లీ గార్లు, కెల్లీగారు ఉదయపువేళ, మరియు రాత్రి వేళ కూడ ఉపదేశించిరి, జిమ్ కెల్లీగారు గొల్గొతా కొండపై, సిలువపై వ్రేలాడుచు యేసుచెప్పిన ఆఖరి మాటలను విశ్లేషిస్తూ గొప్ప ఆత్మీయ భావములను వెలికితీసి చూపించగా, వినిన వారందరు ముగ్ధులైరి.

డిశంబరు మూడవ తేదీనాడు జిమ్ కెల్లీగారు, వి. సుదర్శనరావ్ గారు (రాజమండ్రి). ఆర్. సిహెచ్. సద్గుణరావు గారు (శ్రీకాకుళం), డి. చిరంజీవిగార్లు (బండార్లంక) చక్కటి బైబిలు ఉపన్యాసములనిచ్చిరి. మూడవ తేదీ రాత్రి చిరంజీవిగారు "సమాధానపరచువారు ధన్యులు వారు దేవునికుమారులనబడుదురు" అనే అంశముపై ఉపదేశించిరి. ఆయన ప్రసంగము ఈ సంచికలో క్లుప్త రూపముగా

# సత్యవాక్కు

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | జనవరి - 2010 | సంచిక -6


## సంఘము - దేవుని కుటుంబము

(The Church, the family of God)

క్రీస్తుయేసులోనికి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన ప్రతివాడును దేవుని కుటుంబమయిన సంఘముతో చేర్చబడతాడు. మానవుడెవడు క్రొత్తనిబంధన సంఘములో తనకుగా తాను చేరలేడుగాని దేవుడే అతన్ని చేర్చుతాడు. మారుమనస్సు పొందిన విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మముపొందినప్పుడు ప్రపంచమంతటా యున్న దేవుని కుటుంబములో సభ్యుడవుతాడు.

సంఘము అనుపదము 'ఎకెసీయ' యను గ్రీకుపదమునుండి ఉద్భవించినది. సంఘము అనగా పిలువబడినవారని యర్థము. "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారని" అపొ. పేతురు సంఘాన్ని గూర్చి పలికాడు (1 పేతురు 2:9).

సంఘము క్రీస్తు శరీరమై యున్నది. "సంఘము అను శరీరమునకు ఆయనే

శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" అని కొలస్స 1:18 చెప్పుచున్నది. గనుక క్రొత్త నిబంధనలో సంఘమును గూర్చి చెప్పబడుచున్నప్పుడు క్రీస్తుచే నడుపబడుచున్న, క్రీస్తు ఆజ్ఞలకు లోబడి నడుచుకొన్న సమూహమును గూర్చి చెప్పబడుచున్నది.

వ్యక్తిగత క్రైస్తవులు దేవుని కుటుంబమై యున్న సంఘములో సభ్యులు. సంఘము అను పదములో దేవునితో వ్యక్తిగత క్రైస్తవులకున్న సంబంధము మాత్రమేగాక, సభ్యుల మధ్యగల పరస్పర సంబంధము కూడా ఇమిడియున్నది. క్రీస్తు సంఘసభ్యులు ఒకని భారములను మరొకడు మోయవలెనని ఆజ్ఞాపింపబడిరి (గలతీ 6:2). వారు ప్రేమ చూపుటకును, సత్కార్యము చేయుటకును ఒకనినొకడు పురికొల్పాలి (హెబ్రీ 10:24). "మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థన చేయుడి" యని వారు ఆజ్ఞాపింపబడిరి (యాకోబు 5:16). అందువలన క్రొత్తనిబంధన సంఘము పునరుద్ధరించబడాలని మేము చెప్పుచున్నప్పుడు, దేవునితోను, మానవులతోను మానవునికి గల సత్సంబంధాన్ని పునరుద్ధరించాలని మాయొక్క ఉద్దేశ్యము.

క్రీస్తుసంఘము ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితమే స్థాపించబడెను. పరిశుద్ధాత్మద్వారా దేవుడు అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించగా, వారా సత్యాన్ని ప్రజలకు బోధించారు (యోహాను 14:26; 16:13; 2 తిమోతి 3:16,17). ఆ సత్యము పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబండెను (యూదా :3). ఇంకో మాటలో, క్రొత్తనిబంధన లిఖిత పూర్వకముగా ఇయ్యబడిన తరువాత దేవుడు మానవులకు బయలు పరచవలసినది యిక యేదీలేదు. గనుక అతడు శాపగ్రస్థుడవునని అపో.పౌలు గలతీ 1:9లో చెప్పాడు. అందు వలన దేవుడు మానవులకు క్రొత్తగా యేమీ బయలు పర్చుటలేదని గ్రహించాలి.

ఒకడు క్రీస్తుసువార్తను విని, విశ్వసించి, దానికి విధేయత చూపినప్పుడు, క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని తన జీవితంలో పునరుద్ధరిస్తాడు. అతడు సువార్తకు విధేయత చూపగానే సార్వజనికంగా యున్న క్రీస్తు సంఘముతో చేర్చబడతాడు, అట్టివారు ఇద్దరు ముగ్గురుగాని, ఎక్కువమంది గాని ఒకే వూరిలో యున్నప్పుడు వారు స్థానికక్రీస్తు

సంఘమవుతారు. మొదటి శతాబ్దములో యున్న క్రీస్తు సంఘాన్ని తమ గ్రామంలో సాక్ష్యంగా పునరుద్ధరించిన వారవుతారు. క్రొత్తనిబంధన లిఖింపబడిన తరువాత, ఇంచుమించు అపొస్తలులందరు మరణించుసరికి దేవుని వాక్యముతో బాటు, మానవులు తమ పారంపర్యాచారములను కొద్ది కొద్దిగా సంఘము లోనికి తీసికొని వచ్చుటకు మొదలు పెట్టారు. యూదులు పాతనిబంధన చట్టానికి ఏమి చేసారో వీరును అట్లే చేసారు. యేసువారికి, "మీరు దేవుని ఆజ్ఞను విడిచి పెట్టి మనుష్యుల పారంపర్యాచారమును గైకొనుచున్నారు.... మీరు మీ పారంపర్యాచారమును గైకొనుటకు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరిం చుదురు" అని చెప్పారు (మార్కు 7:8,9). దేని విషయమై యేసుప్రభువు యూదులను ఖండించెనో, దానినే నేడు ప్రజలు చేయుచుండుట విచారకరము.

ఆదిమ సంఘానికి బయలు పర్చబడిన సత్యమునుండి మానవులు తొలగిపోతారని క్రొత్తనిబంధన లేఖకులు ముందుగానే హెచ్చరించారు. "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యములబోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పుచున్నాడు". "జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసి కొందురు" (1 తిమో 4:3; 2 తిమో 4:3). "మరియు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు" అని అపొ.పౌలు హెచ్చరించాడు (అపొ.కా. 20:30).

అయితే ప్రపంచమందంతటా లక్షలాది ప్రజలు క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించుచున్నారు. క్రొత్తనిబంధనలో క్రీస్తుయొక్క ఏకైక నిజమైన సంఘాన్ని కనుగొన్నారు. క్రీస్తుయొక్క ఈ శిష్యులు కేవలం క్రైస్తవులని మాత్రమే పిలువ బడుదురు. ఏలయనగా మొదటి శతాబ్దములో క్రీస్తుయొక్క శిష్యులు కూడ క్రైస్తవులని మాత్రమే పిలువబడ్డారు (అపొ. కా. 11:26). వారు కేథలిక్కులు కాదు, ప్రొటెస్టాంటులు కూడాకాదు. వారు బైబిలు సంగతులను బైబిలు పేర్లతోనే పిలుచుదురు. మరియు బైబిలు ఎక్కడ మాట్లాడునో అక్కడ మాట్లాడుదురు, బైబిలు ఎక్కడ మౌనియగునో అక్కడ మౌనియగుదురు. సంఘవిశ్వాసము, ఆచరణ, ఆరాధనలయందు ప్రవేశించిన మానవ

కల్పిత బోధలను, పారంపర్యాచార ములను విసర్జించి క్రీస్తుయొక్క క్రొత్తనిబంధననే అనుసరింతురు.

యేసుప్రభువు దేవుని కుమారుడని వారు విశ్వసింతురు. నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు అని పేతురు ఆయనను గూర్చి ఎట్లు ఒప్పుకొన్నాడో, అట్లే వారును ఒప్పుకొందురు (మత్తయి 16:13-18). అట్టి విశ్వాసులందరు తమ గత పాపములను విసర్జించి దేవుని తట్టుతిరిగి, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుదురు (అపొ.కా. 2:38). ఈ విధంగా బాప్తిస్మము పొందినవారిని ప్రభువే తన సంఘంలో చేర్చుకొంటారు. వారు మిగిలిన విశ్వాసు లందరితో కలసి దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధిస్తు, యితరులను క్రీస్తుకొరకు సంపాదించుటకు కృషిచేస్తారు. ఈ గొప్ప పునరుద్ధరణ ఉద్యమములో నీవును మాతో కలసి దేవుని పనిలో సహకరించాలని మనవి చేయుచున్నాము.

దేవుని రుజువులు -6

## శిలాజ రికార్డులలో దేవుని రుజువు

### (Evidence of God in Fossil Record)

"ఉన్నదంతా ప్రకృతి వలననే కలిగినది. ప్రకృతి చట్ట ప్రకారము దానికదే విశ్వానికి జన్మనిచ్చినది. అలనాడెప్పుడో అది ఒక జీవకణమును కలుగజేసింది. ఆ కణమునుండి ప్రకృతి క్రమేపి ఉన్నత జీవ దశకు చేరుకొన్నది. నేటి లోకంలో యున్న జీవరాశులన్నియు ప్రకృతి కృత్యములే. దేవుడవుసరం లేదు" అనేది ప్రాకృతి వేత్తల సిద్ధాంతము. దానిని Naturalism అంటారు.

**చార్లెస్ డార్విన్** (Charles Darwin):

ప్రాకృతివేత్తల తత్వానికి చార్లెస్ డార్విన్ అనునతడు నాయకుడు. 'ఆరిజన్ ఆఫ్ స్పీషీస్" (Origin of Species) అను అతని గ్రంధము ప్రాకృతి వేదాంతాన్ని ఎక్కువ బలపరచినది. "ఈ భూమి మీద నివసించిన జీవులన్నియు ఆదిలోయున్న ఏదో ఒక ప్రాధమిక జీవి నుండి వెలసినవని" అతడు చెప్పాడు. అంటే ఇంకో మాటలో జీవమంతయు ఒకే ఒక్క కణము నుండి ఉద్భవించెనని డార్విన్ యొక్క అభిప్రాయము.

తదుపరి వేలకోట్ల సంవత్సర ముల కాలములో ఈ ఏకకణము నుండియే ఉన్నత జీవరాసులు పరిణామము జెందివచ్చెనని అతడనుకొనెను. డార్విన్ తలంపులను బట్టి దేవుని

సహాయము లేకయే జీవము పరిణామము జెందుచు వచ్చెను.

అతని పరిణామ సిద్ధాంతాన్ని వర్ణించుటకు గాను డార్విన్ 'జీవవృక్షము' అనే పటమును గీసి చూపించెను. ఆదిమ ప్రాథమికకణము ఆ చెట్టు యొక్క మొదట యుండును. తదుపరి దాని అవయవములు, శాఖలు, చిన్న కొమ్మలు మొదలైనవి పైకి పెరిగెను. ఈ ఉన్నత దశకు జీవము చేరుటకు ప్రాథమికము నుండి జటిలమయ్యెను.

గత శతాబ్ధములో లక్షలాది ప్రజలు డార్విన్ యొక్క పరిణామ సిద్ధాంతాన్ని అంగీకరించారు. "దేవుడక్కర్లేదు, ప్రకృతే అంతా సాధించేసింది" అని వారన్నారు, గాని "ప్రపంచములు దేవుని వాక్యమునుబట్టి నిర్మాణ మైనవనియు అందును బట్టి దృశ్యమైనవి కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు" బైబిలు చెప్పుచున్నది. (హెబ్రీ 11:3). మొదట దేవుడు భౌతిక ప్రపంచాన్ని సృజించారు. తరువాత ఆయన జీవముగల వృక్షములను, మృగ జీవులను భూమిపై సృజించారు. ఈ రెండు దృక్పధాలలోను యేది సరియై నది? జీవాన్ని ప్రకృతే సృజించిందా? లేక దేవుడే సృజించారా?

**శిలాజముల రికార్డు** (The Fossil Record):

శాస్త్రజ్ఞులు చదువగలిగిన పురాతన రికార్డు ఒకే ఒక్కటున్నది. అది శిలాజముల రికార్డు. పురాతన కాలములో యుండిన మృగచరములు, పక్షులు వృక్షముల యొక్క ఎముకలు, ముద్రలు, రూపములు మొదలైనవాటిని Fossil Record అంటారు. ఈ శిలాజలముల వలన మనకు పూర్వ కాలము నాటి జీవములను గూర్చి కొంతమట్టుకు సమాచారము లభించును.

వృక్షముల యొక్కయు జంతువుల యొక్కయు శరీరములు త్వరలో కుళ్లిపోవును. లేదా అవి వేరే మృగములు పక్షుల వలన తినివేయబడును. కొన్ని సందర్భాలలో ఈ కళేబరములు ఆకస్మాత్తుగా మట్టిలోనో, తారులోనో, బంక మన్నులోనో పాతిపెట్టబడును. అప్పటికి సరియైన వాతావరణం ఉన్నట్లయితే ఈ కళేబరములు నెమ్మదిగా, ఆలస్యముగా కృషించిపోవును గాని వాటి భాగములు లవణములతో నింపబడును. ఈ లవణములు రాతివలె గట్టిబడిపోయి పూర్వం వుండిన వృక్షముల యొక్కయు జంతువుల యొక్కయు అకృతులను చెదరకుండా యుంచును.

శిలాజ అవశేషములను స్టడీ చేయు శాస్త్రజ్ఞులు (Paleontologists)

ఆఫ్రికా, ఆస్ట్రేలియా, కెనాడా, చైనా ఇంగ్లాండు, గ్రీన్‌లాండ్ దేశములలో ఆదికాలములో జీవించిన జీవులను గూర్చిన శిలాజములను కనుగొనిరి. ఈశిలాజములను బట్టి జటిలమైన జీవులు భూమిమీద అకస్మాత్తుగా ఉద్భవించినట్లు గ్రహించిరి. వివిధ భూజంతువులు, మాట వరుసకు కనురెప్పపాటులో 40 రకములైన జంతువులు ఉద్భవించినట్లు ఆశిలాజములనుబట్టి వారు కనుకొనిరి. ఆజంతువులు నేటికిని మన మధ్య యున్నవి.

ఆ జంతువులు యొక్క ప్రాథమిక శారీరక నిర్మాణము మన కార్లు, విమానము, మోటరు బోట్ల వలె వివిధములుగా యున్నవి. ఆయా యంత్రములలో నానాటికీ మార్పులు కొనితేబడినను, ప్రాథమిక నమూనా మాత్రము మార్పులేనిది. ఒక కారుకు ఇంజను, ఛాసీస్, బాడీ, చక్రములు, ఏక్సిల్, బ్రేకులు, టైర్లు, స్టీరింగ్ మొదలగునవి యుండును. మోటారు బోటుకు కూడ అట్లే యుండును. కార్లు, బోట్లు, విమానములకు కామన్‌గా యుండేవి ఉంటాయి. అయిననూ ప్రతి యంత్రానికి ఒక ప్రాథమిక నమూనా యుంటాది. అదే సంగతి శాస్త్రజ్ఞులు కనుగొన్న పురాతన జంతువులలోను యున్నది. ప్రతి జీవరాశిలోను కొంత మార్పు సంభవించును. అవియున్న వాతావరణమున కనుగుణంగా ఆ మార్పులు సంభవించును. ఒకే జాతి జంతువులలో ఇట్లు సంభవించిన మార్పులను మైక్రోఎవల్యూషన్ అని చెబుతారు. అదొక శాస్త్రీయ వాస్తవం. అందువలననే కుక్కలు, గుర్రములు, దూడలు, పిల్లులు మొదలగువాటిలో మనం వివిధ రకములను చూడగలు గుచున్నాము. అయితే డార్విన్ యొక్క మేక్రో ఎవల్యూషన్ మాత్రం వాస్తవానికి దూరం. ఆయా జాతుల జంతువులు, జీవులు అకస్మాత్తుగా కలిగి యుండలేదని డార్విన్ యొక్క ఉద్దేశ్యము. గాని శిలాజములలో యున్న చరిత్ర అవి అట్లే కలిగెనని చెబుతున్నది. భూమి మీద వివిధ రకముల జీవులు అకస్మాత్తుగా ఉద్భవించడం కేంబ్రియన్ ఎక్స్‌ప్లోజన్ అనీ, బయోలాజికల్ బిగ్ బేంగ్ అని చెబుతు యుంటారు.

కేంబ్రియన్ ఎక్స్‌ప్లోజన్ డార్విన్ యొక్క పరిణామ సిద్ధాంతానికి తీవ్రమైన సవాలుగా యున్నది. డార్విన్ యొక్క జీవ వృక్ష పట్టికను అది తలక్రిందులు చేసేసింది. ఆది నుండీ వృక్ష, జంతు జాతులు నిర్దిష్టమైన విధంగా ఆర్గనైజ్ చేయబడెనని అవి ఒక దానిపైకి మరొకటి జారబడలేదని శిలాజములు రికార్డు చెప్పుచున్నది.

మానవ ఏకైక జీవకణములో ఎన్‌సైక్లోపిడియాలలో యున్న దాని కంటే ఎక్కువ సమాచారము కలిగి యుంటే, ఆదిలో కలిగిన 40 రకముల జంతు జాలములలో యున్నవి ఇంకెంత సమాచారము నియ్యగలవో ఆలోచించుము. ఇటువంటి సమాచారము ఒక జ్ఞాని వలననే ఎల్లప్పుడు కలుగును.

**మనస్సు మార్చుకొనిన నిర్దేవుడు :**

డా|| ఏందోని ఫ్లూ అను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అర్ధశతాబ్ధము వరకు నిర్దేవుల చాంపియన్. కెనడా, ఇంగ్లాండ్ దేశములలోని అనేక విశ్వవిద్యాయాల్లో అతడు దేవుని గూర్చిన శాస్త్రయుక్తమైన రుజువేమీ లేదని చెప్పాడు.

గాని ఇప్పుడు ప్రొఫెసర్ ఫ్లూగారు తన మనస్సు మార్చుకొన్నారు. DNA ను గూర్చిన ఆధునిక వాస్తవాలను బట్టి "జీవముద్భవింపజేయడానికివున్నా క్లిష్టమైన జటిలమైన సంగతులను బట్టి చూస్తే అది దైవికంగానే సంభవించెనని అతడు చెప్పాడు. "నేను చెప్పిన మాటలను బట్టి నా సహచరులలో కొందరు ఆందోళన జెందుదురని నాకు తెలియును గాని నేను ఎల్లవేళలా రుజువులనే పాటిస్తాను, నమ్ముతాను. అవి ఎక్కడకు నడిపించినా సరే" అని ఆయన చెప్పారు.

డా|| ఆంథోని ఫ్లూగారి యొక్క జ్ఞానయుక్తమైన యధార్ధతను మేము హర్షించుచున్నాము. బైబిలు సూచించు దేవుని యందు విశ్వాసముంచుటకు అవుసరమైన మొదటి అడుగును ఆయన వేసియున్నారు.

**ముగింపు :**

ఈ పాఠంలో భూమియొక్క వయస్సు ఒక సమస్యకాదు. అయితే శిలాజ రికార్డులు భూమి మీద జంతు, వృక్ష జీవములు అకస్మాత్తుగా ఉద్భవించెనని చెప్పుచున్నవి. అది ప్రాముఖ్యము. అవి క్రమేపీ పరిణామము జెంది భూమి పైకి రాలేదు. శిలాజరికార్డు దేవుని సూచించుచున్నది.

-రిచర్డ్ ఏడ

## బహుప్రియుడైన దానియేలు

బైబిలునందలి ప్రముఖ వ్యక్తులలో దానియేలు ఒకడు. ఆతని గురించి ఏమియు చెడుగా వ్రాయబడ లేదు. ఇతడు దేవుని సేవకుడు దేవునికి బహుప్రియుడు. యూదులు బబులోను చెరలోనున్న 70 సం||ల కాలమును గూర్చి వ్రాసాడు. దానియేలు అనగా "దేవుడే న్యాయాధిపతి " అని అర్ధం.

క్రీ॥పూ 604 లో బబులోనుకు చెరగా కొనిపోబడిన వారితో దానియేలు ఆతని స్నేహితులయిన షద్రకు, మిషాకు, అబెద్నెగోలున్నారు. వారు రాజవంశస్థులు దావీదు నుండి ఉద్భవించినవారు.

రాజు నపుంసకుల అధిపతియైన అష్పెనజునకు ఇలా ఆజ్ఞాపించాడు: "ఇశ్రాయేలీయుల రాజవంశములలో ముఖ్యులై లోపములేని సౌందర్యమును సకల విద్యా ప్రవీణతయు, జ్ఞానమును కలిగి తత్వజ్ఞానము తెలిసినవారై రాజునగరు నందు నిలువదగిన కొందరు బాలురను రప్పించి కల్దీయుల విద్యను బాషను వారికి నేర్పుము". (దానియేలు 1:4). కావున వారికి 3 సం॥లు బబులోను విద్య నేర్పబడింది . రాజు భోజనపు బల్లనుండి భోజనము, ద్రాక్షారసము వచ్చేవి అయితే దానియేలు వాటిని నిరాకరించాడు.

**రాజు భోజనం :**

1 రాజులు 4:22-23 వచనాలలో రాజైన సొలొమోను భోజనపు బల్లపై ఉండే భోజనము మొత్తము, అందలి రకాలు సవివరంగా మనం చూడగలం. అదే విధంగా బబులోను రాజు భోజనపు బల్లకూడా తప్పనిసరిగా అనేక రుచికరమైన విలువైన ద్రాక్షరసాలు, పండ్లరసాలు, ఆహారపదర్థాలతో నిండి ఉంటుంది గాని 16సం॥ల వయసు గల దానియేలు మాత్రం "రాజుభుజించు భోజనమును, పానము చేయు ద్రాక్షారసమును పుచ్చుకొని తన్ను అపవిత్ర పరచుకొనకూడదని ఉద్దేశించి తాను అపవిత్రుడు కాకుండునట్లు వాటిని పుచ్చుకొనకుండ సెలవిమ్మని నపుంసకుల అధిపతిని వేడుకొన్నాడు (దాని 1:8).

రాజు భోజనపు బల్లపై నున్న మాంసము వారి అన్యదేవతలకు బలి ఇచ్చిన జంతువుల నుండి వచ్చునది. రెండవదిగా ఇశ్రాయేలీయుల దేవుడు మోషేద్వారా వారు ఏరకమైన మాంసమును తినవలెనో, ఏది తినకూడదో దానిని ఏవిధంగా తినవలెనో అంతా తెలియచేసారు. వారికి కొన్ని అపవిత్రమైన జంతువులు ఉన్నవి . వాటి మాంసము తినకూడదు. (లేవి 11 అధ్యా ; అపో.కా. 10:9-14). రాజు బల్ల వద్ద నుండి తినవలెనని రాజు ఆజ్ఞ అయినప్పటికి దేవుని ఆజ్ఞకు అవిధేయత చూపి తనను తాను అపవిత్రపరచు కొనకూడదనుకున్నాడు. అందువల్లనే యోసేపు కూడా కామతప్తురాలైన పోతిఫరు భార్యయొక్క చర్యను తిరస్కరించాడు (ఆది 39:7-23). మోషే కూడా ఫరోకుమార్తె

యొక్క కుమారుడనని అనిపించుకొని కొద్దికాలం పాపభోగముల నుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించడానికే ఎన్నుకున్నాడు. (హెబ్రీ 11:24-26).

**అపవిత్రత అవిధేయతయే :**

అపవిత్ర పరచుకోవడం అంటే అవిధేయత చూపడమే. యేసు క్రీస్తు రక్తము మన గత పాపములన్నిటి నుండి బాప్తిస్మము ద్వారా శుద్ధి చేస్తుంది. క్రొత్త నిబంధన గ్రంధములో వ్రాయబడిన ప్రభువు యొక్క ఆజ్ఞలను మీరి మనలను మనము అపవిత్రపరచుకొన కూడదు. "నోటి నుండి బయటకు వచ్చునవి హృదయములో నుండి వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును. దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు అబద్ధసాక్షములు, దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును" (మత్తయి 15:18-20; యాకోబు 1:27). దానియేలు వలె మనలను అపవిత్ర పరచుకొనకూడదని, దేవుని ఆజ్ఞలకు లోబడవలెనని మనము నిశ్చయించు కొనాలి. బబులోను చెరనుండి ఇశ్రాయే లీయుల పిల్లలు తిరిగి యెరుషలేముకు వచ్చినపుడు "ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దానిచొప్పున నడుచుకొను టకును ఇశ్రాయేలీయులకు దానికట్టడలను విధులను నేర్పుటకును దృఢ నిశ్చయము చేసికొనెను" (ఎజ్రా 7:10).

**హృదయంలో నిశ్చయించుకొనాలి :**

"మీరు మొదట దేవుని రాజ్యమును నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33). దేవునిని తెలిసికొను టకును, ఆయనకు విధేయత చూపుటకును, దేవునికి ప్రధమ స్థానం ఇచ్చుటకును మన హృదయంలో నిశ్చయించుకొనాలి. అపొస్తులుల బోధయందును, సహవాస మందును, రొట్టె విరుచుటయందును, ప్రార్ధన చేయుట యందును ఎడతెగక ఉండాలని మన హృదయంలో నిశ్చయించు కొనాలి (అపొ. కా. 2:42). "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు ఆదినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా అలాగుచేయుచు ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము" (హెబ్రి 10:25).

ప్రభువుసేవకు ఇచ్చుటలో పౌలు ఈలాగు చెప్పుచున్నాడు. "ప్రతీవాడు తన హృదయంలో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. సణుగుకొనక,

బలవంతముగా కాక ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని దీవించును" (2 కొరిం 9:7). మన బిడ్డలు నడువ వలసిన రీతిలో వారికి తర్ఫీదునిచ్చుటకు మనం మన హృదయంలో నిశ్చయించుకొనాలి. వాడు పెద్దవాడైనపుడు దానినుండి తొలగిపోడు. (సామె 22:6). దేవుని వాక్యం అనుదినం చదువుటకు, ప్రార్థన జీవితం కలిగి ఉండుటకు మనం మన హృదయంలో నిశ్చయించుకొనాలి. ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో (ఫిలి 4:8) వాటిని అనుసరించుటకు మనము సమర్పించుకొనిన యెడల దానియేలు అతని స్నేహితులవలె మనము కూడ దేవుని దృష్టిలో, పెద్దల దృష్టిలో ప్రియులంగా ఉంటాము (దాని 1:9). నపుంసకుల అధిపతియైన అష్పెనజు వారిని పది దినములు పరీక్షించిన తరువాత వారిభోజనమునకు శాకధాన్యాదులను, పానమునకు నీళ్లును తీసికొనుటకు అనుమతింపబడిరి. 3 సం॥ల అనంతరము దానియేలు, షద్రకు, మిషాకు, అబెద్నగోల వంటి కళగల వారెవరు నెబుకద్నెజరు ఆస్థానంలో లేరు. "జ్ఞాన వివేకముల ప్రతి విషయములోను వీరు తన రాజ్యమందంతట నుండు శకున గాండ్ర కంటెను గారడీ విద్యగలవారం దరికంటెను పదియంతలు శ్రేష్టులని తెలియబడెను" (దాని 1:20). "అపవిత్రమైన ముసలమ్మ ముచ్చటలను విసర్జించి, దేవభక్తి విషయములో నీకునీవే సాధకము చేసికొనుము......... నీకు అనుగ్రహింపబడి నీలో ఉన్న వరమును అలక్ష్యము చేయకుము" (1 తిమోతి 4:7,14) అని పౌలు యౌవనుడైన తిమోతికి చెబుతున్నాడు. దేవభక్తిని అనుసరించిన అనేకమంది దేవుని సేవకులలో దానియేలు ఒకడు. "ఇట్టిశాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తనయింటికి వెళ్లి యథాప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్లూని, తన యింటి పైగది కిటికీలు యెరుషలేము తట్టునకు తెరువబడియుండగా తన దేవునికి ప్రార్థన చేయుచు ఆయనను స్తుతించుచు వచ్చెను" (దాని 6:10).

దానియేలు వలె, యౌవనుడైన తిమోతి వలె మనము కూడా దేవభక్తిని కలిగియుండవలెను. అది మన జీవిత విధానం కావలసి ఉంది. దేవుని ఆజ్ఞలను పాటించాలి అని మనం స్థిరమైన నిర్ణయం తీసికొనినపుడు మనము కూడా దేవునికి బహుప్రియుడైన (దాని 10:11). దానియేలువలె ఆశీర్వదింపబడుదుము.

- కవిత గూటం

# క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది ?

## (What think ye of Christ ? )

### మత్తయి 22:42

**1. ఈ ప్రశ్న ప్రాముఖ్యమైనది :**

అది విశ్వాసము యొక్క మూలరాయి (యెషయా 28:16; ఎఫెసీ 2:20). మరియు అది ఈ లోక నిరీక్షణ (1తిమో 1:1).

మనుష్యుడు క్రీస్తును గూర్చి యేమి యోచించునో దానిపై అతని ఆత్మయొక్క నిత్యగమ్యమును నిర్ణయించును (యోహాను 8:24; మత్త 10:32,33). ఈ ప్రశ్నను గూర్చి మానవుడు ఉదాసీనత కలిగియుండకూడదు. క్రీస్తును నిరాకరించువారు కూడ ఆయనను గూర్చిన పరిశోధనను తెలిసికోవాలి. బుద్ధునిగూర్చి గాని, మహమ్మదును గూర్చిగాని ఎవరైనా చెబితే ప్రజలు సాధారణంగా కలవరపడరు. గాని క్రీస్తును గూర్చి చెప్పగానే కొందరు వెంటనే కలవరపడతారు. ఈ వ్యత్యాసం ఎందుకు? కారణం యేమంటే ప్రజలు బుద్ధుని గూర్చి గాని, మహమ్మదును గూర్చిగాని భయపడరు. అయితే యేసు తాను చెప్పినట్లు దేవుని కుమారుడై యుండవచ్చు నేమోయని ఆయనను గూర్చి భయప డుదురు. ఇంతకు, ఆయన ఎవరి కుమారుడు?

**2. పరిసయ్యులు ఆయన దావీదు కుమారుడని జవాబిచ్చారు:**

"ఒకప్పుడు పరిసయ్యులు కూడి రాగా యేసువారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమితోచుచ్నుది ? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్త 22:41-42).యేసు శరీరమును బట్టి దావీదు కుమారుడే (రోమా 1:7). ఆయన తల్లి మానవమాత్రురాలు గనుక ఆయన మనుష్య కుమారుడు (మత్త 16:13). తన తల్లిదరపున ఆయన మనుష్యుడు. క్రీస్తు శరీరముదాల్చిన దేవుడు. ఆయన శరీరధారియై మన. మధ్య నివసించెను (యోహాను 1:14). ఆయనలో దైవత్వము, మానవత్వము రెండు పరిపూర్ణముగా యున్నందున మన విమోచకుని గాను, మధ్యవర్తిగాను యుండుటకు తగిన వాడాయెను (1తిమో 2:5,6). మనుష్య కుమారునివలె క్రీస్తు శోధించబడెను (మత్త 4:1-11). ఆయన ఆకలిగొనెను (మత్త4:2). దప్పిగొనెను (యోహా 19:28), వేదననుభవించెను (లూకా 22:44), ప్రార్థించు అవుసరత కలిగి యుండెను (మత్త 26: 36).

**3. ఆయన దేవుని ఏకైక కుమారుడు :**

క్రీస్తు దావీదు కుమారుడని పరిసయ్యులు ఇచ్చిన జవాబు సత్యమే, గాని అది పరిపూర్ణ సత్యము కాదు. క్రీస్తు కేవలము దావీదు కుమారుడే అయితే దావీదు ఆయనను నాప్రభువని ఆత్మవలన ఏల చెప్పుచున్నాడని యేసు ఆపరిసయ్యులను అడిగెను. దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారినడుగగా ఎవడును మారుమాట చెప్పలేకపోయెను (మత్తయి 24:45-46). కీర్తన 110:1, అపొ.కా. 2:34,35 కూడ చూడండి. దావీదు కంటే ముందునుండే నేనున్నందున నేను దావీదు కుమారుని కంటే ఉన్నతుడనని క్రీస్తు యొక్క వాదన. అది నిజం , క్రీస్తులేని కాలం అంటూ యేమీ లేదు (యోహాను 1:1; 8:58). ఆయన అల్ఫాయు, ఓమేగయు అనగా ఆదియు అంతమునై యున్నారు (ప్రక 1:8). కాలము ఆరంభము కాకముందునుండే క్రీస్తు వుండెను. కాలంతము తరువాత కూడ ఆయన యుండును.

క్రీస్తు దేవుని యొక్క అద్వితీయ కుమారుడు. పరిశుద్ధాత్మశక్తి వలన ఆయన కన్యకు జన్మించెను (లూకా 1:26-35). దేవుని కుమారుడుగా తన తండ్రివలె ఆయన దేవుడు, ఆయన ఇమ్మానుయేలని పిలువబడెను, అనగా దేవుడు మనకు తోడని అర్థము (మత్త 1:23) . ఆయన శరీరావతారములో యున్నదేవుడు. "ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవిషయమున నీతి పరుడని తీర్పునొందెను. దేవ దూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను, ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1తిమో 3:16). అందువలననే నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడని ఆయన చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యున్నాడు (హెబ్రీ 1:3).

**4. ఆయన దేవుని కుమారుడని అంగీకరించబడెను:**

దేవుడే యేసు తన కుమారుడని అంగీకరించెను, మత్త 3:16,17, 17:1-5.

ఆయన శిష్యులు కూడ ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొనిరి (మత్త 14:33). దయ్యములు (మత్త 8:29), సైనికులు (మత్త 27:54), చివరకు సాతాను కూడ ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొనెను (మత్త 4:5).

**5. ఆయన బోధలే ఆయన దైవత్వాన్ని రుజువు చేయుచున్నాయి :**

"ఆయన అధికారముగల వానివలె వారికి

బోధించెను" (మత్త 7:29). ఆయన అధికారయుక్తమైన దైవవాక్కులు మానవులనుండి ఆయనను ప్రత్యేక పరచినవి. ఆయన గతాన్ని గూర్చి, భవిష్యత్తును గూర్చి కూడా ఖచ్చితముగా మాట్లాడెను. ఆయన రెండవ రాకడ రాత్రివేళ, పగటివేళ కూడ వచ్చునని ఆయన చెప్పెను (లూకా17:31,34). భూమి గుండ్ర ముగా యున్నందున ఒకే సమయమందు యిది సాధ్య మగును. ఆయన దేవుడు గనుక భూమి యొక్క వర్తులాకారమును గూర్చి ఎరుగును.

ఆయన మానవుని అంతర్యమును గూర్చి ఎరిగిన వాడుగనుక ఆయన దేవుడని రుజువగుచున్నది (యోహాను 2:25; 4:29).

ఆయన మాట్లాడినట్లు ఏమానవుడు ఎన్నడు మాట్లాడలేదు (యోహాను 7:46).

**6. క్రీస్తు యొక్క పనులే ఆయన దేవుని కుమారుడని రుజువుచేయుచున్నవి:**

ఆయన చేయుచున్న పనులను బట్టి ఆయన యందు విశ్వాసముంచవలెనని ఆయన చెప్పెను (యోహాను 10:37-38).

ఆయన చేసిన అద్భుతములు ఆయన దేవుని కుమారుడని రుజువుచేయు చున్నవి.

ప్రకృతి శక్తులపై ఆయనకుశక్తి యుండెను ఆయనగాలిని సముద్రమును నిమ్మళిం చెను (మత్త 8:23-27), నీళ్ల మీద నడిచెను (మత్త 14:24 - 33). నీళ్లను ద్రాక్షారసముగ మార్చెను (యోహాను 2:7-11).

ఆయనకు రోగములపై శక్తియుండెను. శతాధిపతి యొక్క దాసుని ఆయన స్వస్థపరచెను (మత్త 8:15-13). పన్నెండు సంవత్సర ములనుండి రక్తస్రావముతో బాధపడుచున్న స్త్రీని ఆయన స్వస్థపరచెను (మత్త 9:20-22).

చివరకు మరణము కూడ ఆయనకు లోబడెను. నాలుగు దినముల మట్టు కు చనిపోయిన లాజరును ఆయన బ్రదికించెను (యోహాను 11:43- 44).

ఆయన చేసిన అద్భుతములను గూర్చి చదువుట వలన, లేక వినుట వలన మనకు విశ్వాసము కలుగునట్లు అవికొన్ని వ్రాయబడెను (యోహాను 20:30-31). గనుక బైబిలులో క్రీస్తును గూర్చియున్న రికార్డు నమ్మదగినదా?

**7. బైబిలు రికార్డు ఖచ్చితం:**

బైబిలులో యున్న రికార్డు కల్పితం కాదు. వారు చూచారు, విన్నారు, యేసును తాకారు (1 యోహాను 1:1).

లేఖకులు యదార్థవంతులు, క్రీస్తు కొరకు తమ ప్రాణముల నర్పించారు. వారి కంటే యదార్థవంతులైన లేఖకులు

చరిత్రలో కనబడరు. బైబిలు యదార్థం కాకపోతే, చరిత్రలో యేదీ నమ్మ దగినది కాదు.
క్రీ॥శ 2010 అంటే అర్థం యేమిటి? అంటే క్రీస్తు వచ్చి ఇప్పటికి 2010 సంవత్సరములైనదన్నమాట ! క్రీస్తు యొక్క ఆగమనమును బట్టి చరిత్ర లెక్కింపబడుచున్నది. ప్రతి ఆదివార మున ప్రపంచమందంతటా లక్షలాది ప్రజలు ఆరాధనకు కూడు కొనుచున్నా రంటే దాని అర్థం యేమిటి? మానవ చరిత్రలో నాలుగు వేల సంవత్సరముల మట్టుకు ఆదివారమునకు ప్రాముఖ్యత యేదీ లేదు. గాని క్రీస్తు యొక్క పునరుత్థానం అంతా మార్చి వేసింది. యేసు ఆదివారమున మృతులలో నుండి లేచారు .అందువలన ఆదినమునకు అంత ప్రాముఖ్యత యిప్పుడున్నది. మరియు అది ప్రభువుదినమని పిలువ బడుచున్నది (ప్రక 1:10).
చరిత్రకారులు కూడ యేసు దేవుడని నిర్ధారించారు. అట్టి వారిలో జోసిఫస్ అనునొకడు ముఖ్యుడు.
ఆయన మన ప్రభువు ఆయన దేవుని కుమారుడు, దేవుడు! ఆయనకు "మహిమయు, ప్రభావమును యుగయుగ ములు కలుగునుగాక, ఆమేన్" (ప్రక 1:6).

– లీరోయ్‌బ్రౌన్లో

## "సమాధాన పరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురు"

(Blessed are the peace makers, for they shall be called sons of God )

ప్రభువైన యేసుక్రీస్తు వారుకొండమీద చేసిన ప్రసంగాన్ని మత్తయి 5,6,7. అధ్యాయాలలో చూడగలము. ఒక రాజ్యానికి రాజ్యాంగం ఏవిధంగా ఉంటుందో అదే విధంగా క్రీస్తు సంఘమనే రాజ్యానికి ఈ ప్రసంగం క్రైస్తవ రాజ్యాంగమని చెప్పవచ్చును. మోషే సీనాయి కొండ మీద దేవుని నుండి ధర్మశాస్త్రాన్ని తీసుకొని రావడం ద్వారా యూదుల యుగానికి నాంది పలికినాడు. అదేవిధంగా యేసుక్రీస్తు వారు తన కొండ మీద ప్రసంగం ద్వారా క్రొత్తనిబంధన యుగానికి పునాది వేసారు. క్రైస్తవ్యమునకు అవసరమైన అన్ని ముఖ్య సూత్రములు ఇందులో యున్నది. ఈ ప్రసంగంలో తొమ్మిది ధన్యతలు కలవు. దీనిలో పరలోకరాజ్యమును గూర్చి ముఖ్యముగా చెప్పబడెను (మత్తయి 5:3,10,20; 6:9, 10,33;7:21).

ధన్యత Blessed అనుమాట (Makarios )మకారియోస్ అను గ్రీకు పదమునుండి వచ్చినది. దీని అర్థం సంతోషం, భాగ్యం (Happy Fortunate). నిజమైన సంతోషము భూసంబంధమైన వాటినుండి గాక పరసంబంధమైన వాటినుండి వచ్చును.

సమాధానము అనగా ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పందం లేదా అవగాహన అని చెప్పవచ్చును (Peace means, understnading between two). సమాధానమును గూర్చి మూడు విషయాలను పరిశీలిద్దాం.

**1. దేవునికి మానవునికి మధ్య సమాధానం కావాలి:**

మానవుడు చేసిన పాపాలను బట్టి దేవునితో సమాధానం లేకుండా ఉన్నాడు పాపములు దేవునికి మనకు అడ్డముగా వచ్చినవి. అవి మరణాన్ని కలుగజేసినవి (యెషయా 59:1; ఎఫెస్సి 2:1,2). దేవుని మహిమను పొందకుండా చేయుచున్నవి (రోమా 3:23-26).

అయితే యేసుక్రీస్తు ద్వారా దేవుడు మనలను సమాధానపరచుచున్నాడు. యేసుక్రీస్తు సమాధానమునకు అధిపతి (యెష 9:6). ఆయన ద్వారా సమాధానం కలుగును (రోమా 5:1). సమాధానంలోకి నడిపిస్తాడు (లూకా 1:7,9;2థెస్స 3:16). ఏవిధంగా అనగా ఆయన చిందించిన రక్తంద్వారా మనపాపములను కడిగి దేవునితో సమాధానపరచును (రోమా 5:10). ఆయన రక్తంద్వారా మన విశ్వాసమును బట్టి మనం సమాధాన పరచబడుచున్నాము (రోమ 3:26).

ఏవిధంగా మనకు సమాధానం దొరుకుతుంది? బాప్తిస్మం ద్వారా మాత్రమే (మార్కు 16:16, అపో.కా. 22:16). తద్వారా మనదేవుని తండ్రీ, నాథా, అబ్బా అని పిలిచే యోగ్యతను కలిగింటాము.

**2. నీలోనీకు సమా ధానం కావాలి:**

అనేక సమస్యలు మనలను అశాంతికి గురిచేస్తు ఉన్నాయి. అవిలోక విషయాలలో, హెచ్చింపబడడం, ధనవంతులం కావలెననెడి కాంక్ష, అన్నీ సాధించాలనుకోవడం, ఇతరులపై అసూయ, ద్వేషం మొదలగునవి. మీలో యుద్ధములు, పోరాటములు దేని నుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే గదా! (యాకోబు 4:1,2). బాహ్య పురుషుడు, అంతరంగ పురుషుడు మధ్య పోరాటం (2 కొరింధి 4:16). మనం పాపం చేసినట్లయితే సమాధానం ఉండదు. ఉదా: ఇస్కరియోతు యూదా మరియు పేతురు. మనలో సమాధానం కొరకు 1 లోకాశలను విసర్జించాలి (1యోహా 2:15). 2. యవ్వనేచ్ఛలనుండి పారిపోవాలి (2తిమోతి 2:22). దైవభక్తి సంపాదిం

చుకోవాలి (1 తిమో 6:16). శరీరమును నలుగగొట్టి లోపరచుకోవాలి (1 కొరి 9:27).

**3.పొరుగువానితో సమాధానం కావాలి:** కుటుంబ సభ్యుల మధ్య సమాధానం కావాలి. లేదంటే చాలా తీవ్రమైన అశాంతికి గురై అనారోగ్యం పాలవుతాం. సంఘ సభ్యుల మధ్య సమాధానం కావాలి, మనం నివశిస్తున్న సమాజం మధ్య సమాధానం కావాలి. ధనం కొరకు, ఆస్తుల కొరకు తల్లిదండ్రులను చంపుచున్నారు. అన్నదమ్ముల మధ్య సఖ్యత లేదు అక్కచెల్లెళ్ళ మధ్య అసూయ, సమాధానం ఎక్కడాలేదు. ఒకనినొకడు కరచుకొని భక్షించిన యెడల మీరు నశించి పోవుదురు అని వాక్యం చెబుతున్నది. (గలతీ 5:15). కనుక సమాధాన కర్తయైన యేసు వైపుచూడాలి. ఆయన వాక్యాన్ని చదివి గ్రహించి ప్రవర్తించాలి 1. నిన్నువలె నీపొరుగువాని ప్రేమించు అను ఒక్కమాటలో ధర్మశాస్త్రం సంపూర్ణమై యున్నది (గలతి 5:14). జగడములు పుట్టించు వానిని దేవుడు అస్సహ్యించు కొనును. (సామెత 6:19). మంచితో చెడును జయించాలి (రోమా 12:20,21). ఒకనినొకడు సహించుకోవాలి (ఎఫెస్సీ 4:3).

యేసు క్రీస్తు ఒక్కడే దేవుని తో మనలను సమాధానపరచును. ఆయన ఒక్కడే మనలో మనకు సమాధాన పరచగలడు మరియు ఆయనే సహోదరుల మధ్య సమాధానం ఇవ్వగలడు.

అయితే నేడు మనలను కూడా దేవుడు సమాధాన పరచవలెనని, అట్టివారు ధన్యులని ఆయన చెప్పుచున్నాడు.

"సమాధానపరచుట ఆసక్తితో చేయుడి" (రోమా 14:19). పాపులు దేవునితో సమాధాన పడునట్లు మనము కృషి చేయాలి (2 కొరిం 5:20). క్రీస్తు సువార్తను ప్రకటించి బాప్తిస్మం ఇవ్వాలి (2 తిమోతి 4:2). అగ్నిలోనుండి లాగినట్లు కొందరిని రక్షించాలి (యూదా 23). నీతిని అనుసరించి నడచుకొ నునట్లు అనేకులను ప్రభువైపు తిప్పాలి (దాని 12:13). పాపిని వాని తప్పు మార్గమునుండి మళ్ళించాలి (యాకోబు 5:20).

ఈ విధంగా మనము చేయుటద్వారా సమాధానపరచు వారమగుదుము తద్వారా దేవుని కుమారుల మనబడుదుము. ఇది ఎంత గొప్ప దీవెన!

దేవరపల్లి చిరంజీవి
బందార్లంక

# నోవహు ఓడ నీడలు
## (Shadows of Noah's Ark)

ఆదికాండము 6-8 అధ్యాయాలలో జలప్రళయమును గూర్చియున్న కధనం అందరు ఎరిగినదే. అయితే ఆ సంఘటనను మనం సవిస్తరంగా విశ్లేషిస్తే దాని వెనుకనున్న దేవుని సంకల్పాన్ని స్పష్టముగా గ్రహించు కోగలము. దేవుని రక్షణ మార్గమును గూర్చి ఆశ్చర్యపడుదుము. అదెట్లో గమనింతము.

ఘోరదుష్టత్వములో మునిగియున్న ఆనాటి లోకంలో నోవహు ఒక్కడే నీతిపరుడై యుండెను. అతను దేవుని కృప పొందిన వాడై యుండెను. దేవుడు దుఃఖాక్రాంతుడై నోవహుతో "నేను సృజించిన నరులను నరులతో కూడా జంతువులను పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమి మీద నుండ కుండ తుడిచివేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను" (ఆది.కా. 6:7). నోవహు భక్తితో కూడిన భయము కలిగి యుండెను (హెబ్రీ 11:7).

**రక్షణమార్గము :**

నోవహును అతని కుటుంబమును దేవుడు రక్షించిన విధానమును బట్టి జగత్తుపునాది వేయబడకముందే దేవుని మనస్సులోయున్న మానవజాతి రక్షణ సంకల్పము యొుక్క జాడ తెలియనగును (ఎఫెసీ 1:4-11). బైబిలునందగుపడు మూడు ప్రాముఖ్య విమోచన సంఘటనలు అనగా నోవహు, మోషే, క్రీస్తు. వారి జీవితములు ఒక్కొక్కటి ఒక్కో మెట్టువలె బయల్పడుచున్నవి. నోవహు అతని కుటుంబం రక్షించబడడం ప్రాథమికం, మోషేను ఇశ్రాయేలీయులను రక్షించడం గంభీరం, జటిలం. దేవుడు వారికిచ్చిన ఆజ్ఞలు అధికం, తద్వారా పాపము చేయుటకున్న అవకాశాలు అధికం. క్రైస్తవుల రక్షణలో గత రెండు పథకాలను గూర్చిన జ్ఞానమే గాక వారు లోబడవలసిన ఆజ్ఞలు, విధుల కూడ వివరించబడియున్నవి. ఎందువలన ? ఏలయనగా ధర్మశాస్త్రము వలనగాక యేసుక్రీస్తు ద్వారానే కృపయు సత్యమును కలిగెను (యోహాను 1:17). నోవహు, మోషేల భౌతిక రక్షణ విధానమును గ్రహించుట ద్వారా క్రీస్తులో కనబడు ఆత్మీయ రక్షణను మనం గ్రహించుకో గలము. ఈ మూడు యుగాల్లో యున్న రక్షణ సంకల్పములు నిత్యము జీవించాలనే మానవుని కోరికను సంతృప్తిపరచునవిగా యోచించబడెను.

**'రక్షణ పెట్టె'**

నోవహు యొుక్క ఓడ తదుపరి రెండు రక్షణ విధానములకు ముందు

సూచికగా కనబడుచున్నది. దానిని ఇప్పుడు గమనించుదాం. జలప్రళయములో ప్రాముఖ్యముగా మనకు కనబడునది నోవహు నిర్మించిన ఓడయే. ఆ ఓడ 450×75×45 అడుగుల పరిమాణములతో దీర్ఘచతురస్రాకారముగా యుండి ఏమంత చూడముచ్చటగా కాక నల్లటి పెద్ద పెట్టె వలె యుండెను. బయట ప్రపంచానికి అదొక పెద్ద నల్ల పెట్టెవలె కనబడి యుండినను అది దేవుని ప్రశస్త స్వాస్థ్యమును రక్షించుటకు ఉపయోగపడిన పరికరము.

ఈ పెద్ద పెట్టె హెబ్రీ భాషలో 'టేబ' (tebah) అని పిలువబడెను. అదేరీతిగా బాలుడైన మోషేను రక్షించిన జమ్ము పెట్టె కూడ హెబ్రీ భాషలో 'టేబ' అని పిలువబడెను. టేబ అనగా సాధారణ మైన పెట్టె కాదు గాని ప్రశస్తమైన, విలువైన సామగ్రిని దాచే పెట్టె, విలువైన ఆభరణముల పెట్టెయని అర్థము. గనుక నోవహు, మోషేలు ఎవరు? వారు దేవునికి ప్రశస్తమైన సేవకులు. వారిద్దరు ఎవరికి మాదిరిగా యున్నారు? యేసుక్రీస్తుకే గదా. క్రీస్తు, ఆయన ప్రజలు దేవుడేర్పరచుకొనిన ప్రశస్తస్వాస్థ్యము. ఈ మాటలు ఇంతకు ముందెక్కడ గమనించాము ? దేవుడు ఇశ్రాయేలీయులతో "మీరు సమస్త దేశజనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురని" చెప్పెను. వారు ఆయనకు యాజకరూపమైన రాజ్యము గాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని ఆయన చెప్పెను (నిర్గ 19:5-6). క్రొత్త నిబంధనలో తాను ఏర్పరచుకొనిన ప్రజలు రాజులైన యాజకులును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలైయున్నారని చెప్పబడెను (1పేతురు 2:9-10). సంఘము ఎంత ప్రశస్తమైన స్వాస్థమో ఆలోచించుకొనగలవా? వారు రాజులైన యాజకులైతే దేవుడు వారికి నిత్య జీవమనే స్వాస్థ్యమును అనుగ్రహించి యున్నాడు.

**కీలు :**

నోవహు ఓడను ఎట్లు నిర్మించాలో అతనికి హెచ్చరిక లీయబడెను. దేవుడతనికి ఇట్లు చెప్పెను: "నీవు దాని చేయవలసిన విధమిది; ఆ ఓడ మూడు వందల మూరల పొడుగును, ఏబది మూరల వెడల్పును, ముప్పది మూరల యెత్తును గలదైయుండవలెను. ఆ ఓడకు కిటికీ చేసి పైనుండి మూరెడు క్రిందికి దానిని ముగించవలెను. ఓడ తలుపు దాని ప్రక్కను ఉండవలెను; క్రింది అంతస్తు, రెండవ అంతస్తు మూడవ అంతస్తు గలదిగా దాని చేయవలెను" (ఆది.కా. 6:15-16). చితిసారకపు మ్రానుతో ఆ ఓడను చేసి అరలు పెట్టి ఆ ఓడను చేసి లోపటను వెలుపటను దానికి కీలు పూయవలెనని దేవుడు నోవహుకు చెప్పెను (14వ).

ఆ ఓడ వెలపల లోపల నోవహు

కీలు పూయవలెను. కీలు నల్లటి తారులాంటి పదార్థము. అది నీళ్లు చొరబడకుండా చేయు పదార్థము. అయితే హెబ్రీ భాషలో 'కీలు'కు వాడబడిన పదానికి లోతైన భావమున్నది. అది అలంకారరీతిగా వాడబడిన పదము. కోఫర్ (Kopher) అను హెబ్రీ పదము నుండి కీలు అనే పదము వచ్చినది. కోఫర్ అంటే పూతపూయుట, కప్పుట అనే భావం, కఫార్ (Kaphar) అనునది దాని నామవాచకము. కఫార్ అనగా ప్రాయశ్చిత్తము లేక విమోచన అనే అర్థం. ఈ కఫార్ అను మాట లేవీ 17:11లో వాడబడింది. "రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్టు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలోనున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము (Kaphar) చేయును".

ఆదికాండము 6:14 దాని ఆత్మీయ భావముతో వ్రాయబడితే ఇట్లుండును; చితిసారకపుమ్రానుతో నీకొరకు ఓడను (పెట్టెను –టేబాను) చేసికొనుము. ఆఓడను చేసి వెలుపటను లోపటను దానికి రక్తముతో ప్రాయశ్చిత్తము చేసి (కీలు) పూయుము!

భౌతికంగా నీళ్ళు ఓడలోనికి చొరబడ కుండా చేయుటయే కీలు యొక్క ప్రయోజనము. ఓడను, దానిలోని ప్రశస్త జీవరాసులను కాపాడడం దాని పని. ఆత్మీయంగా చూస్తే ఆ ఓడ ప్రాయశ్చిత్తార్థ రక్తముతో పరిరక్షింపబడెను! మనం గమనించ వలసిన ప్రాముఖ్యాంశం యేమంటే, ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తు రక్తము మన పాపములకు వెలవట ఒక్కసారే ప్రాయశ్చిత్తము చేయును (అపో.కా. 2:38). ఒకడు సంఘముతో చేర్చబడి నప్పుడు క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన రక్తము లోపట ప్రభురాత్రి భోజన రూపమున మనకు ప్రాయశ్చిత్తము చేస్తూ దేవుని నిత్య రక్షణను మనకు సాధ్యపరచుచున్నది (1కొరింథీ 11:25, 1థెస్స 10:10; లూకా 22:20). ఇది ఆశ్చర్యము కాదు మోషేను, ఇశ్రాయేలీయులును ఐగుప్తు నుండి నిష్క్రమించక ముందు రక్తము వలన మరణ దూత నుండి రక్షించబడిరి. ఇంకో మాటలో ఆత్మీయంగా లోకమునుండి రక్షించబడిరి (ప్రక 11:8). వారు మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి (1 కొరింథీ 10:2).

**బాప్తిస్మము :**

తన కాలపు లోకమునకు నోవహు రక్షణను బోధించుచుండగా దేవుడు దీర్ఘశాంతముతో కనిపెట్టెను. కాలము పూర్ణమైనప్పుడు దేవుని ఆజ్ఞ చొప్పున

నోవహు ఆ ఓడను వివిధ జీవరాసులతో నింపెను. దేవుడు దాని ద్వారమును మూసెను. అప్పుడు దేవుడు ఆకాశపు తూములు, మహాగాధ జలముల ఊటలన్నియు విప్పెను. జలములు విస్తరించి ఓడను తేల జేసినందున అది భూమి మీద నుండి పైకి లేచెను. పైనుండి పడు వర్షపాతము వలనను, క్రిందినుండి ఉబుకు నీళ్ల వలనను ఆ ఓడ తాత్కాలికముగా చీకటితో కప్పబడెను. దేవుని యందలి విశ్వాసము వలన ఆయన ఆజ్ఞకు లోబడుట వలన నోవహు ఇంత గంభీరమైన ఓడను నిర్మించెను.

ఆ జలములపైకి ఓడ తేలగానే దానిలో నున్న వారు సంతోషముతో గంతులు వేసియుందురు. బాప్తిస్మము పొందువారు కూడ ఆనందముతో ఆ నీటి సమాధి నుండి పైకి లేతురు ! క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందు వారందరు చేయు దానిని నోవహు, తన కుటుంబము అలనాడెప్పుడో ఛాయరూపకముగా అనుభవించారు. వారు నీటి ద్వారా, నీటి గుండా సురక్షిత స్థావరమునకు చేర్చబడ్డారు. అందుకే పేతురు ఇట్లు చెప్పుచున్నాడు. "దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండి నప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు అనగా చెరలో యున్న ఆత్మల యొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:20-21).

బైబిలులో నీరు జీవ మరణములను వేరుచేస్తు కనబడును. ఆ సారూప్యములో నీటిపైనున్నవారు, ఓడలో యుండిరి. వారు సురక్షితులు, సజీవులు. గాని ఓడ వెలుపల నీటిలో యున్న వారు మృతులు. నేటి లోకం విషయం కూడ యిదే. ఓడలో యున్నవారు గొప్ప భయకంపిత వాతావరణమును రుచిచూచి జలప్రళయము నుండి రక్షింపబడినా, వారు ఆరిన నేలపై అడుగిడుటకు కొంత కాలము ఓడలో (సంఘములో) కనిపెట్ట వలసి వచ్చినది. వారు ఓడ బయటకు రాగానే ఒక నూతన ప్రపంచములో ప్రవేశించిరి!!

– డాన్‌కే

ప్రచురించబడినది.

డిశంబరు 4 తేది శుక్రవారం వి. సుదర్శనరావు గారు, జిమ్‌కెల్లీ గార్లు ఉపదేశించగా, మధ్యాహ్న విరామము తరువాత లెక్చరర్‌షిప్ ముగించబడెను.

లెక్చరర్‌షిప్ జరిగిన నాలుగు రోజులు దేవుడు మంచి వాతావరణము నను గ్రహించారు. అమెరికానుండి వచ్చిన ప్రసంగీకుల ఆంగ్లోపన్యాసములను రిక్కీ గూటం గారు , సద్గుణరావు గారు , జాషువా గూటం గారు తెలుగులోనికి సమర్ధవంతముగా తర్జుమాచేసిరి. సోదరులు సిహెచ్. సద్గుణరావు (కాకినాడ), డి. నాని (నడకుదురు), యస్. యేసురత్నం (కాకినాడ) గార్లు పాటలు నడిపించడంలో సహకరించిరి. సోదరులు యస్. సూర్యచంద్రరావు, ఎ.గోపాల్, కె. అప్పారావు, యం. అప్పారావుగార్లు భోజన కార్యక్రమాలను పర్యవేక్షించిరి. స్థానిక క్రీస్తు సంఘస్థులు అన్ని విషయాలలోను సహకరించి పని చేసినందున, సమస్తము సక్రమముగా, మర్యాదగా, నిర్వహించడెను. దేవుని నామము ఘనపరచబడెను. ఈలెక్చరర్‌షిప్‌కు హాజరైన వారందరు మరల వచ్చే సంవత్సరము తప్పక హాజరగుదుమని చెబుతు సహోదరుల నుండి సెలవు తీసికొనిరి. సోదరులు రీక్కీగూటంగారు లెక్చరర్‌షిప్ డైరక్టర్‌గా అన్ని పనులను సమర్ధవంతముగా నిర్వహిస్తు, వందలాది సువార్తికులతో వ్యక్తిగతంగా మాటలాడుచు, సలహాలనిస్తూ అందరినీ ప్రోత్సాహించిరి.

డిశంబరు 5వ తేదీ శనివారం నర్సీపట్నంలో రిక్కీగూటం గారి ఆధ్వర్యమున బోధకుల సహవాసకూడిక జరిగెను. అందు జిమ్‌కెల్లీ గారు ఉపన్యాసించారు. క్రీస్తు సంఘబోధకులకు అనేక ప్రోత్సాహక సలహాలనిచ్చారు. 6వ తేదీ ఆదివారం ఆయన కాకినాడ క్రీస్తు సంఘములో ప్రసంగించారు, డిశంబరు 8 మంగళ వారం ఉదయం అమెరికాకు విమానంలో బయలుదేరి సతీసమేతంగా తమ గృహానికి క్షేమముగా చేరుకొన్నారు.

# మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004